PRGI NO TGTEL/26/A2948

జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥సంపుటి:1 ॥ సంచిక: 72॥ శనివారం ॥ 8-8-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

08 ఆగస్టు 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:01 సూర్యాస్తమయం - సా. 6:42 తిథి దశమి మ. 1:57 వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం రోహిణి సా. 4:47 వరకు తరువాత మృగశిర యోగం ధ్రువ ఉ. 8:57 వరకు కరణం విష్టి మ. 1:57 వరకు బవ రా. 12:32o వరకు వర్జ్యం ఉ. 9:28 నుండి ఉ. 10:57 వరకు దుర్ముహూర్తం ఉ. 7:42 నుండి ఉ. 8:33 వరకు రాహుకాలం ఉ. 9:11 నుండి ఉ. 10:46 వరకు యమగండం మ. 1:56 నుండి మ. 3:32 వరకు గుళికాకాలం ఉ. 6:01 నుండి ఉ. 7:36 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:25 నుండి తె. 5:13 వరకు అమృత ఘడియలు మ. 1:53 నుండి మ. 3:21 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:47 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

# వరుణ యాగం

## నాగార్జునసాగర్‌లో ఈనెల 10న నిర్వహణ

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు, నదులు జలకళ సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు, వేదపండితులు, సిద్ధాంతులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఈ నెల 10వ తేదీన నాగార్జునసాగర్‌లో యాగం నిర్వహించనున్నారు.

### వర్షాల కోసం ప్రత్యేక పూజలు

### పూర్ణాహుతిలో పాల్గొననున్న రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 7: నాగార్జునసాగర్ డ్యామ్ సమీపంలోని విజయవిహార్ ప్రాంగణంలో వరుణ యాగానికి ఏర్పాట్లు చేస్తున్నా రు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట దేవస్థానం అర్చకులు, వేదపండితులు నిర్ణయించిన శుభ ముహూ ర్తంలో యాగ క్రతువులను నిర్వహించనున్నారు. కృష్ణా, గోదావరి నదులు పరవళ్లు తొక్కాలని, రాష్ట్రంలోని చెరువులు నిండాలని, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని సంకల్పిస్తూ ప్రత్యేక పూజ లు చేపట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా తరువాయి 2 వ పేజీలో..





# నేతన్న సేవలో...

## రూ.179 కోట్లు విడుదల

### 71,536 చేనేత కుటుంబాలకు రూ.25 వేల చొప్పున సాయం

### చీరాలకు పూర్వ వైభవం: చంద్రబాబు

### చేనేత అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు

రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్ల జిల్లా చీరాల నియోజక వర్గం కొత్తపేట గ్రామంలో 'నేతన్న సేవలో' పథకాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు రూ.179 కోట్లను విడుదల చేశారు.

చీరాల, ఆగస్టు 7: ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి, స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసే ఆగస్టు 7ను మరింత ప్రత్యేకంగా నిలిపేందుకు ఈ పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మాత్రమే కాకుండా, ప్రజల అవసరాలను గుర్తించి అదనపు సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలు చేస్తున్నామని చెప్పారు. 'నేతన్న సేవలో' తరువాయి 2 వ పేజీలో..

# డిజిటల్ అసెంబ్లీ

## 'డిజిటల్ కౌన్సిల్'ను ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు

## రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

సాంకేతిక పరిజ్ఞానంతో పాలనను మరింత ఆధునీకరించే దిశగా తెలంగాణ ప్రభుత్వం 'డిజిటల్ అసెంబ్లీ', 'డిజిటల్ కౌన్సిల్'ను ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

హైదరాబాద్, ఆగస్టు 7 (మన దీపం): హైదరాబాద్‌లోని ఐటీసీ కాకతీయలో శుక్రవారం GOVconnect, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (మీ సేవ) సంయుక్తంగా నిర్వహించిన 'ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ కాన్‌క్లేవ్--తెలంగాణ'ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు కృత్రిమ మేధ (ఏఐ), బ్లాక్‌చైన్, డేటా అనలిటిక్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక (మిగతా 2వ పేజీలో)







# తెలంగాణ నీటి ప్రయోజనాలను కాపాడాలి

### కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌కు శుక్రవారం హరీశ్‌రావు లేఖ

తెలంగాణకు న్యాయబద్ధంగా దక్కాల్సిన జల ప్రయోజనాలను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు కోరారు. ఈ మేరకు కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌కు శుక్రవారం ఆయన లేఖ రాశారు.

హైదరాబాద్, ఆగస్టు 7 (మన దీపం): ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్ 85 కింద కేంద్రం జోక్యం చేసుకుని, గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) ప్రతిపాదిత 18వ సమావేశ ఎజెండాలోని 18. 3.1, 18.3. 6, 18.3.11 అంశాలను ఉపసంహరించు కునేలా ఆదేశించాలని కోరారు. తెలంగాణలోని పలు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు ఇప్పటికే లభించిన చట్టబద్ధమైన అనుమతులను తిరిగి సమీక్షించే ప్రయత్నం ఈ ఎజెండా అంశాల ద్వారా జరుగుతోందని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది కేవలం రెండు రాష్ట్రాల మధ్య జల వివాదానికి సంబంధించిన అంశం కాదని, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల విశ్వసనీయత, సంస్థాగత అధికార పరిధి, చట్టబద్ధతకు సంబంధించిన (మిగతా 2వ పేజీలో)



# సంక్షేమం అర్హులకే అందాలి..

### ఉచితాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు

### రైతుబంధు మంచి పథకమే.. సంపన్నులకూ ఇవ్వడం సరికాదు

### ప్రజాధనంపై భారం పెరుగుతోందన్న న్యాయస్థానం

హైదరాబాద్, ఆగస్టు 7 (మన దీపం): సంక్షేమ పథకాలు నిజమైన అర్హులు, నిరుపేదలకు చేరాల్సిన అవసరం ఉందని తెలంగాణ హైకోర్టు అభిప్రాయపడింది. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రవేశపెట్టిన రైతుబంధు వంటి పథకాలు మంచివే అయినప్పటికీ, (మిగతా 2వ పేజీలో)

# రోడ్డు కాంట్రాక్టర్లను వేధించొద్దు

### రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 7 (మన దీపం): రోడ్ల నిర్మాణానికి అవసరమైన మెటల్, ఇసుక, మట్టి తదితర సామగ్రికి సంబంధించిన అనుమతుల విషయంలో చిన్న కాంట్రాక్టర్లను వేధించవద్దని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గనుల శాఖ అధికారులను ఆదేశించారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వారిని వదిలేసి, నిబంధనల ప్రకారం రోడ్డు పనులు చేస్తున్న చిన్న కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. శుక్రవారం సచివాలయంలో గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామితో కలిసి రోడ్డు కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై కోమటిరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే (మిగతా 2వ పేజీలో)



# పెట్టుబడులకు తెలంగాణ అనువైన గమ్యస్థానం: భట్టి

పెట్టుబడులు, వ్యాపార విస్తరణకు తెలంగాణను ప్రాధాన్య గమ్యస్థానంగా ఎంచుకోవాలని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, సాంకేతిక నిపుణులు, వైద్య రంగ ప్రముఖులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

హైదరాబాద్, ఆగస్టు 7 (మన దీపం): అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో భారత కాన్సుల్ జనరల్ కె. శ్రీకర్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గౌరవార్థం విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియాకు చెందిన భారతీయ ప్రవాసులు, పరిశ్రమలు, సాంకేతికత, వైద్యం, వృత్తిపరమైన సేవలు, మానవ వనరులు తదితర రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కాన్సుల్ జనరల్ శ్రీకర్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ ప్రవాసులకు, భారత్‌లోని ప్రభుత్వాలకు మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశ సమగ్ర ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడేలా వ్యాపార, వృత్తి నిపుణులు దీర్ఘకాలిక భాగస్వామ్యాలపై దృష్టి పెట్టాలని కోరారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ సాంకేతికత, ఆవిష్కరణలు, లైఫ్ సైన్సెస్, గ్లోబల్ సర్వీసెస్ రంగాల్లో హైదరాబాద్ దేశంలోని ప్రముఖ కేంద్రాల్లో ఒకటిగా ఎదిగిందన్నారు. ఈ ప్రగతిని కొనసాగించడంతో పాటు అభివృద్ధి చెందుతున్న రంగాల్లో కొత్త పెట్టుబడులు, ఉపాధి (మిగతా 2వ పేజీలో)

## నేటి రాశి ఫలాలు

**మేషం:** చేపట్టిన పనులలో అవరోధాలు ఉన్నపటికీ సకాలంలో పూర్తిచేస్తారు. సంతానం కొన్ని విషయాలలో మీతో విభేదిస్తారు. దూర ప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉంటాయి. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున అదనపు బాధ్యతలు తప్పవు. పాత ఋణముల ఒత్తిడి పెరుగుతుంది.

**వృషభం:** ముఖ్యమైన వ్యవహారాలలో స్వంత ఆలోచనలు పనిచేయవు. కుటుంబ సభ్యులతో అకారణ వివాదాలు కలుగుతాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా పడతాయి. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు నిదానిస్తాయి. వ్యాపార ఉద్యోగాలలో నిలకడ లోపిస్తుంది.

**మిధునం:** ఆర్థిక ఇబ్బందులు నుంచి కొంత వరకు బయటపడతారు. ప్రయాణాలలో నూతన పరిచయాల వలన ఆర్థిక లాభాలు పొందుతారు. ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. కుటుంబ సభ్యులు నుండి వ్యతిరేకత పెరుగుతుంది. వృత్తి ఉద్యోగమున సానుకూల వాతావరణం ఉంటుంది.

**కర్కాటకం:** కొన్ని విషయాలలో అందరితో సమస్యలు కలుగుతాయి. దూర ప్రాంతాల నుంచి అందిన వార్త కొంత ఊరట కలిగిస్తుంది. ఆదాయం ఆశించిన విధంగా ఉండదు. చిన్ననాటి మిత్రులతో మాటపట్టింపులుంటాయి. ఉద్యోగమున తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారిస్తారు.

**సింహం:** బంధు మిత్రులతో గృహమున సంతోషంగా గడుపుతారు. ఆకస్మిక ధన లాభాలు పొందుతారు. వ్యాపారమున స్నేహితుల నుంచి పెట్టుబడులు అందుతాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో నూతన అవకాశములు అందుతాయి.

**కన్య:** చుట్టుపక్కల వారితో ఊహించని విభేదాలు కలుగుతాయి. ధన వ్యవహారాలలో లోటుపాట్లు తప్పవు. సంతాన ఉద్యోగ ప్రయత్నాలు కొంత నిరాశ కలిగిస్తాయి. భాగస్వామ్య వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులు ఉంటాయి. ఇతరుల వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది.

**తుల:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా అవసరాలకు ధన సహాయం లభిస్తుంది. కీలక వ్యవహారాలలో మిత్రుల సలహాలు తీసుకోవడం మంచిది. నూతన వ్యాపారాల ప్రారంభానికి శ్రీకారం చుడతారు. దైవ సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది. నిరుద్యోగులకు ఉన్నత అవకాశములు లభిస్తాయి.

**వృశ్చికం:** దూర ప్రాంతాల ఆప్తుల నుంచి కీలక సమాచారం అందుతుంది. చేపట్టిన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తిచేస్తారు. స్థిరాస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగుపడుతుంది. కుటుంబ సభ్యులతో కలిసి గృహమున సంతోషంగా గడుపుతారు. ఉద్యోగమున ఉన్నతాధికారుల అనుగ్రహం కలుగుతుంది.

**ధనస్సు:** దైవ అనుగ్రహంతో ముఖ్యమైన పనులు పూర్తిచేస్తారు. వృత్తి ఉద్యోగాలలో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో నూతన ఉత్సాహంతో లాభాలు అందుకుంటారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి.

**మకరం:** కుటుంబ సభ్యులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు అవసరం అవుతాయి. కుటుంబ వాతావరణం మరింత చికాకు పరుస్తుంది. ఉద్యోగస్తులు అధికారులతో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. నూతన ఋణ ప్రయత్నాలు అంతగా కలిసిరావు.

**కుంభం:** ఉద్యోగమున అదనపు బాధ్యతల నుండి ఉపశమనం లభిస్తుంది. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊరట చెందుతారు. గృహ నిర్మాణ ఆలోచనలు వేగవంతం చేస్తారు. వ్యాపారాలలో సమర్ధవంతంగా నిర్వహించి లాభాలు పొందుతారు.

**మీనం:** ముఖ్యమైన వ్యవహారాలలో సన్నిహితుల సహాయ సహకారములు అందుతాయి. ఇంటా బయట శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. నూతన వ్యాపారాలు విజయవంతంగా ప్రారంభిస్తారు. నిరుద్యోగులకు అప్రయత్నంగా నూతన అవకాశాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. ప్రయాణాలలో మరింత జాగ్రత్త వహించాలి.







# నేతన్న సేవలో రూ.179 కోట్లు విడుదల

మొదటి పేజీ తరువాయి

పథకం అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. చేనేత అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గొప్ప కళ అని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు చేనేత ఉత్పత్తులతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన చీరాలకు తిరిగి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఇప్పటికే పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. చేనేత వర్గాలకు 50 ఏళ్ల వయసులోనే ఎన్టీఆర్ భరోసా పింఛన్ కింద నెలకు రూ.4 వేల చొప్పున అందిస్తున్నామని, దీని ద్వారా 85 వేల మందికి ఏటా రూ.420 కోట్ల ప్రయోజనం కలుగుతోందన్నారు. అలాగే చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రంలోని 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లు ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నాయని చెప్పారు. అదేవిధంగా 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ రూపంలో రూ.79 కోట్ల ఆర్థిక సహాయం అందించామని వెల్లడించారు. చేనేత రంగానికి అవసరమైన ముడిసరుకు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చేనేత రంగ అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ కార్యక్రమం కింద రూ.10 కోట్లతో 10 చేనేత క్లస్టర్లను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు, ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, అమరావతి సమీపంలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ చేనేత రంగానికి కొత్త అవకాశాలను తెరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం అర్హులకే అందాలి..

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థికంగా స్థితిమంతులైన వారికి కూడా ప్రయోజనాలు అందించడం వల్ల ప్రభుత్వంపై భారీ ఆర్థిక భారం పడుతుందని వ్యాఖ్యానించింది. ఒక కేసు విచారణ సందర్భంగా జస్టిస్ నగేష్ భీమపాక శుక్రవారం ఉచిత పథకాలు, సంక్షేమ కార్యక్రమాల అమలుపై కీలక వ్యాఖ్యలు చేశారు. పేదలు, అవసరమైన వారికి సంక్షేమ ఫలాలు అందించడంలో తప్పులేదని, అయితే కోటీశ్వరులు, సంపన్నులకు కూడా అదే తరహాలో ప్రయోజనాలు కల్పించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతిదీ ఉచితంగా అందించే పరిస్థితి కొనసాగితే ప్రజల్లో పనిచేయాలనే ఆసక్తి తగ్గే ప్రమాదం ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం కష్టంగా మారిందని, దీనివల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. రాష్ట్రంలో సుమారు 1.15 కోట్ల కుటుంబాలకు వివిధ ఉచిత పథకాలు అందిస్తే వాటివల్ల ఏర్పడే ఆర్థిక భారాన్ని ప్రభుత్వం ఎలా భరిస్తుందని ప్రశ్నించింది. ప్రభుత్వాలు ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్ తరాల ప్రయోజనాలను కూడా దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉందని సూచించింది. విద్యార్థులకు ఫీజుల చెల్లింపు వంటి పథకాల్లోనూ నిజంగా అవసరమైన పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయపడింది. ప్రజాధనం సద్వినియోగం కావాలంటే సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత, స్పష్టమైన అర్హత ప్రమాణాలు అవసరమని పేర్కొంది. తాను చేసిన వ్యాఖ్యలను ఏ ఒక్క ప్రభుత్వాన్ని ఉద్దేశించిన రాజకీయ విమర్శలుగా చూడరాదని జస్టిస్ నగేష్ భీమపాక స్పష్టం చేశారు. సమాజంలో భవిష్యత్తులో ఎదురయ్యే పరిణామాలపై బాధ్యతాయుతమైన పౌరుడిగా ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## పెట్టుబడులకు తెలంగాణ అనువైన గమ్యస్థానం: భట్టి

(మొదటి పేజీ తరువాయి)

అవకాశాలను సృష్టించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మూసీ నది పునరుజ్జీవం, సమగ్ర పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణతో పాటు యువతకు భవిష్యత్ ఉద్యోగావకాశాలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.దతెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, సాంకేతిక రంగ నాయకులు, వైద్య నిపుణులు ముందుకు రావాలని భట్టి కోరారు. వినూత్న ఆలోచనలను వ్యాపార సంస్థలుగా మలచడం, నాణ్యమైన ఉపాధి అవకాశాలను సృష్టించడం ద్వారా తెలంగాణ సమగ్ర, సమ్మిళిత ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## నీటి ప్రయోజనాలను కాపాడాలి

(మొదటి పేజీ తరువాయి)

కీలక అంశమని హరీశ్‌రావు పేర్కొన్నారు. సంబంధిత ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖల సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ) సమగ్ర పరిశీలన అనంతరమే అనుమతులు మంజూరు చేసిందని గుర్తుచేశారు. సాంకేతిక, జలవనరుల, ఇంజినీరింగ్, పర్యావరణ, న్యాయపరమైన అంశాలను పరిశీలించడంతో పాటు నదీ యాజమాన్య బోర్డు, సంబంధిత రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఈ అనుమతులు వచ్చాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సమర్థ సంస్థలు ఒకసారి చట్టబద్ధమైన అనుమతులు ఇచ్చిన తర్వాత జీఆర్ఎంబీ వంటి సంస్థ వాటిని తిరిగి సమీక్షించే లేదా రద్దు చేయాలని కోరే అప్పిలేట్ అధికారాన్ని చేపట్టలేదని స్పష్టం చేశారు.దకేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలను జీఆర్ఎంబీ తిరిగి పరిశీలించేందుకు అనుమతిస్తే సంస్థాగతంగా ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడటమే కాకుండా, కేంద్ర ప్రభుత్వ సాంకేతిక సంస్థల అధికారాన్ని కూడా బలహీనపరుస్తుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాళేశ్వరం, చౌటుపల్లి హనుమంతరెడ్డి, ముక్తేశ్వరం, చనాకా-కొరాట (రుధ), మోడికుంటవాగు, కడెం-గూడెం, సీతారామ ఎత్తిపోతల పథకం తదితర తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు ఇప్పటికే లభించిన అనుమతులను తిరిగి పరిశీలించే అంశాలు జీఆర్ఎంబీ ఎజెండాలో ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టులన్నీ నిర్దేశిత చట్టబద్ధమైన పరిశీలన ప్రక్రియ పూర్తయిన తర్వాతే అనుమతులు పొందాయని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ జల హక్కులను గుర్తిస్తూ గతంలో జీఆర్ఎంబీ సమావేశాల్లో జరిగిన చర్చలు, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ



తీసుకున్న నిర్ణయాలను కూడా హరీశ్‌రావు తన లేఖలో ప్రస్తావించారు. ఆయా అంశాలను కేంద్ర జల సంఘం ఇప్పటికే సమగ్రంగా పరిశీలించి ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చినందున, వాటిని పరోక్షంగా తిరిగి తెరపైకి తీసుకురావడం సరికాదని స్పష్టం చేశారు.

## డిజిటల్ అసెంబ్లీ

మొదటి పేజీ తరువాయి

సాంకేతికతలను వినియోగిస్తున్నట్లు చెప్పారు. పౌరుల సమాచార భద్రత, ధ్రువపత్రాల ప్రామాణికతను పెంచేందుకు బ్లాక్‌చైన్ ఆధారిత సర్టిఫికెట్లను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. టీ-ఫైబర్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు హైస్పీడ్ డిజిటల్ కనెక్టివిటీని విస్తరించడంతో పాటు వృద్ధులు, దివ్యాంగులకు ప్రభుత్వ సేవలను ఇంటి వద్దకే అందించే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. 'డిజిటల్ ఆఫీస్ ప్రాజెక్టు' కింద ప్రభుత్వ శాఖల్లో కాగితరహిత పరిపాలనను అమలు చేస్తున్నామని శ్రీధర్‌బాబు చెప్పారు. సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా పాలన కూడా మారాలని, తద్వారా మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన, ప్రజాకేంద్రిత పరిపాలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ఇప్పటికే డిజిటల్ క్యాబినెట్‌ను ప్రవేశపెట్టిందని, 20 ప్రభుత్వ శాఖలను అనుసంధానిస్తూ రియల్‌టైమ్ గవర్నమెంట్ డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేసిందని తెలిపారు. దేశంలోనే తొలి ఏఐ ఆధారిత డేటా ఎక్స్ఛేంజ్‌తో పాటు వాట్సాప్ ఆధారిత పౌర సేవలు, 'మీ టికెట్' వేదికను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు.



## వరుణ యాగం

మొదటి పేజీ తరువాయి

వర్షాభావ పరిస్థితులు తొలగి వ్యవసాయ రంగానికి మేలు జరగాలని ప్రార్థనలు నిర్వహించనున్నారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో యాగ కార్యక్రమాలు జరగనున్నాయి. యాగం నిర్వహణకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాయి. యాగం అనంతరం జరిగే మహత్తర పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, పాడిపంటల సమృద్ధి, జలవనరుల అభివృద్ధి కోసం ఈ ప్రత్యేక యాగాన్ని నిర్వహిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

# రోడ్డు కాంట్రాక్టర్లను వేధించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

మేఘారెడ్డి, టీజీఎండీసీ ఎండీ అనుదీప్ దురిశెట్టి, ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ (హామ్ రోడ్స్) బి.వి.రావు, మైనింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు తమ సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డు పనులు చేస్తున్న చిన్న కాంట్రాక్టర్లకు ఉపయోగించిన మెటీరియల్ విలువకు పది రెట్లు జరిమానాలు విధించడం సమంజసం కాదని మంత్రులు అభిప్రాయపడ్డారు. కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులకు కారణమైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి వివేక్ వెంకటస్వామిని కోమటిరెడ్డి కోరారు. రూ.5 కోట్లకు సంబంధించిన అంశంలో రూ.54 కోట్ల జరిమానా విధించడం దారుణమన్నారు. ఒప్పందాల్లో పేర్కొన్న నిబంధనల మేరకు కాంట్రాక్టర్లు చెల్లింపులు చేస్తున్నప్పటికీ వారిని వేధించడం సరికాదని స్పష్టం చేశారు. తెలంగాణ వ్యాప్తంగా నాణ్యమైన, ఆదర్శవంతమైన రహదా రులను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హామ్) విధానంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిందని కోమటిరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రారంభించిన హామ్ రోడ్డు పనులను 2028 ఆగస్టు నాటికి పూర్తి చేయడమే లక్ష్యమని వెల్లడించారు. కోమటిరెడ్డి ప్రస్తావించిన అంశాలపై మంత్రి వివేక్ వెంకటస్వామి సానుకూలంగా స్పందించి, కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని గనుల శాఖ అధికారులను ఆదేశించారు.

# శ్వేత సంపాదకీయం

**శనివారం 8-8-2026**

## ప్రజాస్వామ్యానికి పట్టిన చీడను వదిలించాలి!


ప్రజాస్వామ్యంలో పాలకులు నియంతులగా మారుతుంటే ప్రెజర్ గ్రూప్ ఉండాల్సిందే. ప్రతిపక్షాల మాట కూడా వినకుండా పాలన చేయడం అలవాటు చేసుకున్నారు. తాము అన్నకున్న విధానంలో పాలన సాగుతోంది తప్ప, ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా సాగడం లేదు. ఇటీవల పరీక్ష పేపర్ల లీకేజీ పాలకులు నిర్లక్ష్య ధోరణికి అద్దం పట్టింది. ఈ క్రమంలో బొద్దింకల దండు ఢిల్లీపై దండయాత్ర చేయడంతో ప్రభుత్వం దిగి వచ్చింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామ చేయడం, పేపర్ లెస్ పరీక్షల కోసం నందన్ నీలుకని నేతృత్వంలో కమిటీ వేయడం వంటిన్నీ చకచకా జరిగిపోయాయి. ఇదంతా కేవలం విద్యార్థుల ఒత్తిడి మూలంగానే జరిగిందని చెప్పాలి. ఈ ఒత్తిడిని కొనసాగించాలని, దేశంలో ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తామని కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే చేసిన ప్రకటన ప్రజాస్వామ్య వ్యవస్థ గట్టిగా నిలబడడానికి తోడ్పడుతంది. అయితే ఈ పోరాటంలో రాజకీయ నాయకుల జోక్యం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా బొద్దింకల పార్టీదే. ఇకపోతు ఈ ఒత్తిడి కొనసాగించేలా దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్' .. అంటే ప్రజలు ఏమంటున్నారు... పేరుతో కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రజల వద్దకు తీసుకెళ్తామని దీప్కే తెలిపారు. నిజంగా ఈ ఆలోచనను స్వాగతించాల్సిందే. ప్రతి ఒక్కరూ ఈ నినాదం వెనక నిలబడాలి. ఎందుకంటే పాలకులు గతి తప్పకుండా ఉండాలంటే ఏదో ఒకచోట చెక్ పడాల్సి ఉంది. విద్యార్థి నిరసనలతో దేశం దృష్టి ఆకర్షించిన కాక్రోచ్ జనతా పార్టీ చేసిన ఈ కీలక ప్రకటన ప్రజలను ఆలోచింప చేసేదిగా ఉంది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు 'క్యా బోల్తీ పబ్లిక్' పేరిట జాతీయస్థాయి ప్రచారం నిర్వహిస్తామని వెల్లడించినందున ప్రజలు కూడా ఈ ఉద్యమాన్ని సొంతం చేసుకోవాలి. మద్దతుగా నిలవాలి.. ప్రజల ఆందోళనలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, అభిప్రాయాలను తీసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని స్పష్టం సిజెపి చేసింది.

సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా పర్యటించి ప్రతి ఒక్కరితోనూ మమేకమవుతామని దీప్కే తెలిపారు. సీజేపీ ఒక రాజకీయ పార్టీగా మారకుండా ఒక ఒత్తిడి బృందంగానే కొనసాగుతుందని దీప్కే ప్రకటించారు. అంటే ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తామని చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశం లేదని, ప్రజల తరఫున ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రెషర్ గ్రూప్‌గా పనిచేయడమే తమ లక్ష్యమని కూడా దీప్కే స్పష్టం చేశారు. దేశ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజులు, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో తగ్గుతున్న విశ్వాసం వంటి అంశాలపై ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రచారంలో విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కూడా పిలుపునిచ్చారు. ఈ రోజు మన దేశంలో సంస్థాగత జవాబుదారీతనం ప్రమాదకర స్థితిలో ఉంది. ఇది మన ప్రజాస్వామ్యానికి ఒక ప్రమాదకర సంకేతం. గతంలో ఓటర్లు ప్రభుత్వాన్ని ఎన్నుకునేవారు. ఈ రోజు ఎవరు ఓటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. ప్రజాస్వామ్యం ఇలా పనిచేయదు. మనం ఎన్నికల సంఘం జవాబుదారీతనాన్ని సరిదిద్దాలి. మనం ఇది చేసేంత వరకు దేశంలో ఎన్నికల అవకతవకలు కొనసాగుతేనే ఉంటాయి. కాబట్టి పోరాటం చేయాలన్న దీప్కే సంకల్పం అభినందనీయం. నిరుద్యోగం దేశంలో ఒక ప్రధాన సమస్యగా మారింది. దీనిపై పాలకపక్షాలు కప్పదాటు ప్రకటనలు చేస్తున్నాయి. దీనిని దేశవ్యాప్త సమస్యగా పరిగణిస్తామని దీప్కే తెలిపారు. దేశంలో నాణ్యమైన విద్య రోజురోజుకూ భారంగా మారుతోంది. వపిసరీతమైన ఫీజుల దోపిడీ సాగుతోంది. అయినా పాలకులు దృష్టి సారించడం లేదు. ఈ రంగంపై పోరాడాలన్న సంకల్పం మంచిదే.

ఈ అంశంపైనే తొలుత తాము దృష్టిసారిస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. సెప్టెంబర్ నుంచి ప్రజల్లోకి వెళ్తామని మీడియా వేదికగా తెలియజేశారు. ఒకటో తరగతికే ఫీజులు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో ఇంకా ఎక్కువే ఫీజులు ఉంటున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ఆ మొత్తాన్ని ఎలా భరిస్తాయి. ఈ ఖర్చుల వల్ల ప్రజలు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఆ భారం తగ్గాలని మా పార్టీ కోరుకుంటోంది. తల్లిదండ్రులు పిల్లలకు ఉన్నత విద్య అందించాలనుకున్నప్పుడు దానిని వారు భారంగా భావించకూడదు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చెప్పిన ప్రకారం.. విద్య ప్రాథమిక హక్కు. గత కొన్నేళ్లుగా అది ఒక వ్యాపారంగా మారిపోయింది. అన్నింటికి మించి జెన్-జీ యువత చేస్తున్న ఉద్యమాన్ని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ స్వాగతించడం విశేషం. యువత ఎదుర్కొంటున్న సమస్యలు, వారు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు సమర్థనీయమైనవేనని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు అనేవి సంభాషణకు, సమస్యల పరిష్కారానికి దోహదపడే మార్గాలని ఆయన స్పష్టం చేశారు. నేటి జెన్-జీ ప్రతి అంశానికి తార్కిక వివరణలు కోరుకుంటోందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశ్నించడం, తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, నిరసనలు తెలియజేయడం ప్రజాస్వామ్య హక్కులేనని మోహన్ భాగవత్ చెప్పుకొచ్చారు. యువత ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకుంటూ వారితో నిరంతర సంభాషణ కొనసాగించడం అవసరమని మోహన్ భాగవత్ నిర్మొహమాటంగా చెప్పారు. మొత్తంగా ప్రతి ఒక్కరూ యువత ఆలోచనలను స్వాగతిస్తున్నారు. పాలకులు కూడా కళ్లు తెరిస్తే మంచిది.

# రైతు పరామర్శలో రగడ

**వైసీపీ కార్యకర్తల తీరుపై అనిత ఆగ్రహం.. రాష్ట్ర ప్రతిష్ఠకు భంగం కలిగించొద్దని సూచన**



అమరావతి, ఆగస్టు 7 : రైతుల సమస్యలను తెలుసుకునేందుకు నిర్వహించిన పరామర్శ కార్యక్రమం రాజకీయ ప్రదర్శనగా మారిందా అంటూ హోంమంత్రి వంగలపూడి అనిత ప్రశ్నించారు. రైతుల కష్టాలను తెలుసుకోవాల్సిన కార్యక్రమంలో కొందరు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మద్యం సేవించి, చొక్కాలు విప్పి వీరంగం సృష్టించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్య వ్యవస్థకు, రాజకీయ సంస్కృతికి మంచివి కావని వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దేశవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షించేందుకు, ఆంధ్రప్రదేశ్‌కు విశ్వసనీయత తీసుకురావడానికి కృషి చేస్తున్న సమయంలో ఇలాంటి సంఘటనలు రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రమాదం ఉందని అనిత అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చ జరగాల్సిన వేదికలు అరాచకాలకు కేంద్రాలుగా మారకూడదని సూచించారు.

రైతుల పరామర్శ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో అసభ్య ప్రవర్తన చోటుచేసుకోవడం బాధాకరమని ఆమె పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై చర్చించాల్సిన సందర్భంలో కొందరు కార్యకర్తలు అనుచితంగా వ్యవహరించడం ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపుతుందని అన్నారు. రాజకీయ నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరపాలని, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలని అనిత సూచించారు. రాష్ట్ర ప్రతిష్ఠకు మచ్చ తెచ్చే చర్యలను ప్రోత్సహించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే రాజకీయాల్లో విలువలు, బాధ్యతలు పాటించాలని అన్నారు.

రాష్ట్ర అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణ, పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలు ప్రస్తుతం అత్యంత కీలకమని హోంమంత్రి పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో రాజకీయ కార్యక్రమాలు ప్రజల సమస్యల పరిష్కారానికి దోహదపడేలా ఉండాలని, వివాదాలకు దారితీయకూడదని సూచించారు. ప్రజలు కూడా బాధ్యతాయుత రాజకీయాలకు మద్దతు ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రాజకీయ భేదాలకు అతీతంగా ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు కట్టుబడి ఉందని అనిత స్పష్టం చేశారు. ప్రజల సమస్యలపై చర్చించే వేదికలు మర్యాదపూర్వకంగా, ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా కొనసాగాలని ఆమె ఆకాంక్షించారు.



## 90 ఏళ్ల వృద్ధురాలి ఆకాంక్షను నెరవేర్చిన సీఎం

**సామాజిక మాధ్యమం ద్వారా చేరిన విజ్ఞప్తి**

**చీరాల పర్యటనలో ఆప్యాయంగా పలకరింపు**

**పుష్పావతితో ప్రత్యేకంగా భేటీ అయిన చంద్రబాబు**

చీరాల, ఆగస్టు 7 : తనను ఒక్కసారి కలవాలనే 90 ఏళ్ల వృద్ధురాలి చిరకాల ఆకాంక్షను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నెరవేర్చారు. బాపట్ల జిల్లా చీరాలకు చెందిన పుష్పావతి అనే వృద్ధురాలు ముఖ్యమంత్రిని కలవాలనే తన కోరికను సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తం చేయగా, ఆ విషయాన్ని గమనించిన ముఖ్యమంత్రి ప్రత్యేకంగా స్పందించారు. చీరాల పర్యటనకు వస్తున్న సందర్భంగా అక్కడే కలుసుకోవచ్చని పుష్పావతికి ముఖ్యమంత్రి ప్రత్యేక సందేశం పంపించారు. దీంతో వృద్ధురాలి కోరిక నెరవేరే అవకాశం కలగగా, ఆమె కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సంఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

శుక్రవారం చీరాల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి పుష్పావతిని ఆప్యాయంగా పలకరించారు. ఆమె ఆరోగ్యం, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధురాలితో కొద్దిసేపు ముచ్చటించి ఆమెతో కలిసి ఫోటో కూడా దిగారు. ముఖ్యమంత్రి తన కోరికను గౌరవించి ప్రత్యేకంగా కలుసుకోవడం పట్ల పుష్పావతి ఆనందం వ్యక్తం చేశారు. తన జీవితంలో ఇది మరపురాని క్షణమని పేర్కొన్నట్లు సమాచారం. ముఖ్యమంత్రిని ప్రత్యక్షంగా చూడాలని చాలా కాలంగా ఎదురుచూస్తున్నానని ఆమె తెలిపినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

ప్రజలతో ప్రత్యక్ష అనుబంధాన్ని కొనసాగించడంలో భాగంగానే ముఖ్యమంత్రి ఈ చర్య తీసుకున్నారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ప్రజల నుంచి వచ్చే అభిప్రాయాలు, విజ్ఞప్తులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు గమనిస్తోందని తెలిపారు. ఈ సంఘటన సామాజిక మాధ్యమాల్లో కూడా విస్తృతంగా చర్చకు దారితీసింది. వృద్ధురాలి ఆకాంక్షను గౌరవించి నెరవేర్చిన ముఖ్యమంత్రి తీరుపై పలువురు ప్రశంసలు వ్యక్తం చేశారు. ప్రజలతో మమేకమవుతూ వారి భావోద్వేగాలకు విలువ ఇవ్వడం మంచి పరిణామమని అభిప్రాయపడ్డారు.



## డీఎస్సీపై జగన్ విమర్శల వెల్లువ

**సీబీఐ విచారణకు ఎందుకు భయమని ప్రశ్న**

**నిరుద్యోగుల నిరసనలపై దాడుల ఆరోపణ**

**మూడు కీలక డిమాండ్లు చేసిన వైసీపీ అధినేత**

తాడేపల్లి, ఆగస్టు 7 : డీఎస్సీ--2025 ప్రశ్నాపత్రం లీకేజీ, నియామకాల్లో అక్రమాల ఆరోపణలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్న నిరుద్యోగ యువతపై ప్రభుత్వం నిర్బంధ చర్యలకు దిగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కాపాడేందుకే ప్రభుత్వం ఇంత తీవ్రంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. డీఎస్సీ నియామకాల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని చెబుతున్న ప్రభుత్వం సీబీఐ విచారణకు ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించారు. విడుదల చేసిన ప్రకటనలో జగన్ మాట్లాడుతూ, డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతూ విజయవాడలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలపై అధికార పార్టీ నాయకులు దాడి చేశారని ఆరోపించారు. పోలీసుల సమక్షంలోనే శిబిరాలను ధ్వంసం చేసి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహా నిరుద్యోగ యువతపై రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడులు జరిగాయని పేర్కొన్నారు. మహిళలపైనా దాడులకు పాల్పడ్డారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిరసన శిబిరాలపై నిర్బంధకాండ కొనసాగుతోందని జగన్ అన్నారు. చిలకలూరిపేట, కనిగిరి, యాడికి, తాడిపత్రి, పలమనేరు, రేపల్లె, గుంటూరు, పొన్నూరు, వేమూరు, మాచర్ల, గురజాల, కందుకూరు, బాపట్ల తదితర ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలను అడ్డుకోవడంతో పాటు నాయకులను అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. శాంతియుతంగా ప్రశ్నించే హక్కును కూడా నిరుద్యోగులకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీ ప్రక్రియపై ప్రభుత్వం పారదర్శకత ఉందని చెబుతున్న నేపథ్యంలో సీబీఐ విచారణకు అంగీకరించడంలో ఇబ్బంది ఏమిటని జగన్ ప్రశ్నించారు. నిజంగా ఎలాంటి అక్రమాలు జరగకపోతే స్వతంత్ర దర్యాప్తుకు ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా జగన్ ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లు ఉంచారు. డీఎస్సీ నియామకాల వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని, విద్యా దీవెన, వసతి దీవెన కింద పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.9,000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 చొప్పున నిరుద్యోగ భృతిని గత బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరాలను ధ్వంసం చేయడం, అరెస్టులు చేయించడం ద్వారా వాస్తవాలను దాచలేరని జగన్ పేర్కొన్నారు. డీఎస్సీ వ్యవహారంలో నిజాలు వెలుగులోకి వచ్చే వరకు, నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



# ఉత్సాహంగా అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలు

### క్రీడాకారులను ఉత్సాహపరిచిన న జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ఎన్‌టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. శుక్రవారం నందిగామ జెడ్పీ హైస్కూల్‌లో ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడాంశాల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 815 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కలెక్టర్ లక్ష్మీశ క్రీడాకారులతో ముచ్చటించి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. పోటీల నిర్వహణ, క్రీడాకారులకు కల్పించిన సౌకర్యాలు, మైదాన ఏర్పాట్లను కూడా కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. పోటీలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించడంతో పాటు క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఈ సందర్భంగా ఆయన అధికారులకు సూచించారు. జిల్లాలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి జిల్లా జట్టుకు ఎంపిక చేయడం పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో జులై 15 నుంచి ఆగస్టు 26 వరకు అమరావతి ఛాంపియన్‌షిప్--2026 పోటీలు



జరుగుతున్నాయి. నియోజకవర్గం మొదలు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, చెస్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, యోగా తదితర 12 క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నాయి. కార్యక్రమంలో డీఎస్‌డీవో కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట

### 'ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు' కార్యక్రమంలో నమోదైన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి

### ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలి: జి. లక్ష్మీశ

పెనుగంచిప్రోలు: ఆగస్టు 07, 2026: ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీకి శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. ప్రజా సమస్యలను కేవలం అర్జీల పరిష్కారంగా కాకుండా, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. 'ఒక నెల -- ఒక గ్రామం -- నాలుగు సందర్శనలు' కార్యక్రమంలో భాగంగా పెనుగంచిప్రోలులోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు, అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, ప్రతి నెలా ఒక నియోజకవర్గాన్ని ఎంపిక చేసి నాలుగు సార్లు ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలులో 'ఒక నెల -ఒక గ్రామం -నాలుగు సందర్శనలు' కార్యక్రమాన్ని మొదటివారం విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీపై పకడ్బందీగా, పూర్తి స్థాయి విచారణ జరిపి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ వారం నిర్వహించిన ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 160 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. వీటిలో ప్రధానంగా రెవెన్యూ భూ సంబంధిత సమస్యలు, పంచాయతీరాజ్‌కు సంబంధించిన సమస్యలు తదితర అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించినట్లు వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యలపై అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

అర్జీలో పేర్కొన్న అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత వ్యక్తులతో మాట్లాడి, వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న అనంతరం నిబంధనల మేరకు ప్రజలకు అనుకూలంగా సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి అర్జీకి పరిష్కారం చూపడమే కాకుండా, భవిష్యత్తులో అదే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కల్పించడంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు, రెవెన్యూ, భూ సమస్యలు, పంచాయతీరాజ్ తదితర అంశాలకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి సత్వర పరిష్కారం అందించడమే 'ఒక నెల -- ఒక గ్రామం -- నాలుగు సందర్శనలు' కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో గడ్డిపాటి అనిల్ కుమార్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి, తహసీల్దార్ బి.కళ్యాణి, తదితర అధికారులు పాల్గొన్నారు.



### క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను

# అత్యంత పకడ్బందీగా చేపట్టాలి

### నోటీసు జారీ చేసిన ఏడు రోజుల్లోగా విచారణ పూర్తి చేయాలి

### ఎన్టీఆర్ జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎం.వి.శేషగిరి బాబు

విజయవాడ: ఆగస్టు 7,2026.ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా అందిన ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని అత్యంత జాగ్రత్తగా, పారదర్శకంగా విచారణ చేసి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎన్టీఆర్ జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, రాష్ట్ర లేబర్, ఫ్యాక్టరీస్, బాయిలర్స్ అండ్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఎల్ఎఫ్బీ & ఐఎంఎస్) సెక్రటరీ ఎం.వి.శేషగిరి బాబు అధికారులను ఆదేశించారు. విజయవాడ కలెక్టరేట్‌లోని ఏపీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో శుక్రవారం ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, ఏడు నియోజకవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు), వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనగా, కొంతమంది శాసనసభ్యులు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎం.వి.శేషగిరి బాబు మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి అందిన ప్రతి క్లెయిమ్, అభ్యంతరం ఎంతో ప్రాధాన్యత కలిగినదని పేర్కొన్నారు. ప్రతి దరఖాస్తును పూర్తిస్థాయిలో పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం మాత్రమే నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

క్లెయిమ్ లేదా అభ్యంతరంపై నోటీసు జారీ చేసిన అనంతరం ఏడు రోజుల్లోగా విచారణ ప్రక్రియను పూర్తి చేసి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్, అభ్యంతరాలను వేగంగా పరిష్కరించేందుకు ప్రతిరోజూ కనీసం 70 కేసులపై విచారణ చేపట్టి పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించే సమయంలో సంబంధిత వ్యక్తుల స్టేట్మెంట్లను స్పష్టంగా, పక్కాగా నమోదు చేయాలని, విచారణకు సంబంధించిన అన్ని అంశాలను రికార్డుల్లో పొందుపరచాలని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా నిబంధనల ప్రకారం పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకతను మరింత పెంచేందుకు క్లెయిమ్స్, అభ్యంతరాలకు సంబంధించిన సమాచారాన్ని నిబంధనల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందుబాటులో ఉంచాలని సమావేశంలో సూచించారు. రాజకీయ పార్టీలు తమ పరిధిలోని ఓటర్ల జాబితాలను పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు లేదా లోపాలు ఉంటే నిర్ణీత సమయంలో అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు జిల్లా స్థాయి అధికారులు, ఈఆర్ఓలు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షిస్తూ, అనర్హుల పేర్లను గుర్తించే విధంగా ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. శాసనసభ్యులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశంలో ప్రస్తావించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని, నిబంధనల మేరకు తగిన చర్యలు చేపడతామని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియలో బీఎల్ఓలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలోని కొన్ని ఫోటోల్లో స్పష్టతకు సంబంధించిన లోపాలు ఉన్నట్లు గుర్తించామని, ఈ దశలోనే వాటిని సరిచేసి ప్రతి ఓటరు ఫోటో స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల ఓట్లు వేర్వేరు పోలింగ్ బూత్‌ల పరిధిలో ఉండకుండా, నిబంధనలకు అనుగుణంగా సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఉండేలా జాగ్రత్తగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు.



### ప్రజల గుండెల్లో పొన్నమండ

# లక్ష్మణస్వామివర్మ

### అగ్నికుల క్షత్రియుల చరిత్రను చాటిచెప్పిన మహనీయుడు

### రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాసేవకు అంకితమైన జీవితంతో సేవా కార్యక్రమాల ద్వారా మన్ననలు పొందిన రాజశ్రీ పొన్నమండ లక్ష్మణస్వామివర్మ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

అగ్నికుల క్షత్రియ జాతిపిత స్వర్గీయ పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర.. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతా గోపీచంద్, అగ్నికుల క్షత్రియ, బీసీ సంఘాల నాయకులు తదితరులతో కలిసి పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పొన్నమండ లక్ష్మణస్వామివర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని పేర్కొన్నారు. అగ్నికుల క్షత్రియుల చరిత్రను భావితరాలకు చాటిచెప్పిన మహనీయుడు లక్ష్మణ స్వామి వర్మ అని.. ఆయన ఆయుర్వేదంతో వేలాది మంది పేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదించారని పేర్కొన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులిచ్చిన గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, గౌరవ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. నాటి సమాజంలో ప్రజల సమస్యల్ని చూసి.. చలించిపోయి వారికి పొన్నమండ లక్ష్మణస్వామివర్మ అండగా నిలిచార న్నారు. పేదల కోసం కోరంగిలో ఉచిత వైద్యశాల ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరాం ప్రసాద్, సగర కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరస్వామి, బీసీ సంఘ నాయకులు సంగేపు రంగారావు తదితరులతో పాటు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇ.జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.




# ఇంతియాజ్ హత్య కలకలం

### నగదు వివాదం ప్రాణం తీసింది

### రాళ్ల దాడిలో టీడీపీ కార్యకర్త మృతి

### ఇద్దరు నిందితులు పోలీసుల అదుపులో

కర్నూలు, ఆగస్టు 7 : కర్నూలు నగరంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఇంతియాజ్ (37) హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. మాసుంబాషా దర్గా సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసుల వివరాల ప్రకారం నగదు లావాదేవీల విషయంలో ఇంతియాజ్‌కు ఇద్దరు వ్యక్తులతో వివాదం నెలకొంది. ఈ వివాదం క్రమంగా ఘర్షణకు దారి తీసి పరస్పర వాగ్వాదం జరిగింది.

వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో ఆ ఇద్దరు వ్యక్తులు ఇంతియాజ్‌పై రాళ్లతో దాడి చేసినట్లు సమాచారం. దాడిలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే స్పందించినప్పటికీ అప్పటికే ఇంతియాజ్ మృతి చెందినట్లు తెలుస్తోంది. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించి విచారణ చేపట్టారు. దాడికి పాల్పడిన ఇద్దరు అనుమానితులను ఇప్పటికే అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని విచారిస్తున్నారు. హత్యకు గల పూర్తి కారణాలు, నగదు లావాదేవీల నేపథ్యంపై లోతుగా దర్యాప్తు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

# నేతన్నకు వెన్నుదన్నుగా ప్రభుత్వం

## రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్.. ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు

విజయనగరం, ఆగస్టు 07: చేనేత కార్మికులకు అన్నివిధాలా ప్రభుత్వం అండగా నిలుస్తోందని, రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారతా సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాట్నం తిప్పి, నూలు ఒడికి నేత కార్మికులను మంత్రి ఉత్సాహపరిచారు.



ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 1905లో మహాత్మాగాంధీ విదేశీ వస్తు బహిష్కరణకు పిలుపునిచ్చారని, ఈ ఉద్యమంలో చేనేత కార్మికులు పోషించిన పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. 2015లో ప్రధాని మోది ఇచ్చిన పిలుపు మేరకు ప్రతీఏటా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించుకొని, నేత వస్త్రాలకు ప్రాచుర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. చేనేత వస్త్రాలకు దేశవిదేశాల్లో ఎంతో డిమాండ్ ఉందని, దానికి తగ్గట్టుగా వస్త్రాలను రూపొందించేందుకు నేత కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. చేనేత వస్త్రాల వాడకాన్ని పెంచేందుకు, కార్మికులను ఆదుకొనేందుకు ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. చేనేత కార్మికులకు 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేసిన ఘనత చంద్రబాబుదేనని చెప్పారు.

నేతన్న సేవలో పథకం క్రింద రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 51,952 మంది, మన జిల్లాలో 709 మంది చేనేత కార్మికులను రూ.25,000 ఆర్థిక సహాయాన్ని ఈ రోజు వారి ఖాతాల్లో జమ చేస్తున్నారని చెప్పారు. మంగళగిరి, ధర్మవరం, పొందూరు లాంటిచోట్ల తయారయ్యే చేనేత వస్త్రాలకు ప్రత్యేక బ్రాండింగ్ తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. మన ప్రాంతంలో చేనేతకు ప్రసిద్ధి అయిన పొందూరులో, సెర్ప్ ఆధ్వర్యంలో కొత్తగా ఒక క్లష్టర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, అక్కడి నూలుతోనే సరికొత్త డిజైన్లతో వస్త్రాలను రూపొందించేందుకు ప్రణాళికను రూపొందించామని మంత్రి వెల్లడించారు.

ఎంఎల్‌సి గాదె శ్రీనివాసులనాయుడు మాట్లాడుతూ, ప్రతీఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి నేత వృత్తిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో మాదిరిగానే ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి చేనేత వస్త్రాలను కొనుగోలు చేసేందుకు రూ.3,000 వరకు రుణం మంజూరు చేస్తే, అమ్మకాలు పెరిగే అవకాశం ఉందని సూచించారు.

ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ, చేనేత వస్త్రాలను ధరించే అలవాటు పెరగాల్సి ఉందన్నారు. గతంలో చేనేత వస్త్రాలను ధరించే వారికి గొప్ప గౌరవం దక్కేదని అన్నారు. ఈ వృత్తిని కొనసాగించేందుకు చేనేత యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని, మగ్గాల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని అన్నారు. డిఆర్‌ఓ సిహెచ్ సత్తిబాబు మాట్లాడుతూ, దేశంలో వ్యవసాయం తరువాత చేనేత వృత్తే ప్రధానమైనదని అన్నారు. ఈ వృత్తిపై లక్షలాది కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని అన్నారు. వారిని ఆదుకొనేందుకు ప్రభుత్వం పలు రకాల సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు.

కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళిశాఖ ఎడి డాక్టర్ వి.పద్మ, రాష్ట్ర పద్మశాలి సహకార సంఘం కన్వీనర్ ఎం.దేవేంద్రనాథ్, కొప్పులవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.రవికుమార్, నేత కార్మికులు త్రినాథ్, లక్ష్మణరావు మాట్లాడారు. ఈ సందర్భంగా సీనియర్ నేత కార్మికులను ఘనంగా సత్కరించారు. నేత వస్త్రాలతో ప్రత్యేకంగా ఒక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. అంతకు ముందు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన చేనేత అవగాహనా ర్యాలీని, ఎంఎల్‌సి గాదె శ్రీనివాసులనాయుడు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో నేతన్నలు పాల్గొన్నారు.



# చేనేతకు అండగా నిలిచింది వైఎస్సార్‌సీపీ

### జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహణ

### నేతన్న నేస్తం అమలును గుర్తు చేసిన నాయకులు

### చిల్లపల్లి మోహన్‌రావు, ఎమ్మెల్సీల వ్యాఖ్యలు

తాడేపల్లి, ఆగస్టు 7 : జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. చేనేత కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం కృషి చేసిన చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చేనేత కార్మికులను శాలువాలతో సత్కరించి గౌరవించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు విశేష కృషి చేశాయని పేర్కొన్నారు. చేనేత కార్మికులకు పింఛన్లు, గృహాలు, ముడి సరుకులపై రాయితీలు, పన్ను సడలింపులు అందించడంలో వైఎస్సార్ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని గుర్తు చేశారు.

ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహన్‌రావు మాట్లాడుతూ చేనేత కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వాలు పనిచేయాలని అన్నారు. 50 ఏళ్లకే చేనేత కార్మికులకు పింఛన్ అందించిన ఘనత వైఎస్సార్‌దేనని చెప్పారు. అలాగే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన నేతన్న నేస్తం పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.24 వేల చొప్పున ఆర్థిక సాయం అందిందని వివరించారు. ఎమ్మెల్సీ మురుగుడు హన్మంతరావు మాట్లాడుతూ చేనేత రంగాన్ని కాపాడాలంటే ముందుగా చేనేత కార్మికుడిని కాపాడాలని అన్నారు. ముడి సరుకులపై సబ్సిడీలు, ఆప్కో ద్వారా కొనుగోళ్లు, ఆర్థిక సహాయ పథకాల ద్వారా గత ప్రభుత్వాలు చేనేత రంగానికి ఊతమిచ్చాయని పేర్కొన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సబ్సిడీలను విడుదల చేసి చేనేత రంగాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ చేనేత రంగం భారతీయ సంస్కృతికి ప్రతీక అని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించిన ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఆప్కోను బలోపేతం చేసి చేనేత ఉత్పత్తులకు మార్కెట్ కల్పించిందని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం చేనేత రంగానికి ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆప్కో ద్వారా చేనేత వస్త్రాల కొనుగోళ్లను పెంచడంతో పాటు పెండింగ్ సబ్సిడీలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు మలసాని మనోహర్ రెడ్డి, వివిధ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.



# లక్ష్మణ స్వామి వర్మ సేవలు ఆదర్శనీయం

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు

విజయనగరం: ఆగస్టు 7, పల్లవ రాజుల వారసులు, అగ్నికుల క్షత్రియుల జాతిపితమహులు, ఆయుర్వేద వైద్యులు పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ సేవలు ఆదర్శనీయమని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం లక్ష్మణ స్వామి వర్మ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ స్వామి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా లక్ష్మణ స్వామి వర్మ జయంతి వేడుకలు నిర్వహించాలని పిలుపునివ్వడం జరిగిందన్నారు. నౌక వాణిజ్య కేంద్రంగా ప్రసిద్ధి చెందిన కురంగరేశ్వరపురంలో జన్మించిన లక్ష్మణ స్వామి వర్మ అగ్నికుల క్షత్రియుల జీవితాల్లో మార్పు కోసం వారి అభివృద్ధి కోసం ఎంతగానో శ్రమించారన్నారు. 1890 సంవత్సరంలో 120 రకాల ఆయుర్వేద ఔషధాలు తయారుచేసి ఇండోనేషియా, జావా, ఆఫ్రికా వంటి దేశ విదేశాలకు సరఫరా చేయడంతో పాటు పేద రోగులకు ఉచిత వైద్య వసతులు ఏర్పాటు చేసిన మహనీయుడు లక్ష్మణస్వామి వర్మ అని మంత్రి కొనియాడారు. అగ్నికుల క్షత్రియ సంఘ ఏర్పాటుతోపాటు, అగ్నికుల దీపిక అనే సొంత ముద్రాలయంతో పత్రికలను ప్రచురించి అగ్నికుల క్షత్రియుల పూర్వ చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలను దశ దిశలా చాటి చెప్పారని అన్నారు. లక్ష్మణ స్వామి వర్మ జీవితం అన్ని వర్గాల వారికి ఆదర్శనీయమని, నేటి యువత ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసుల నాయుడు, ఇందుకూరి రఘురాజు లతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ప్రజలతో మమేకమైన హోంమంత్రి అనిత

### అనిత పర్యటనకు గ్రామస్తుల ఘన స్వాగతం

### అభివృద్ధి పనులపై హోంమంత్రి వివరణ

అనకాపల్లి, ఆగస్టు 7 : అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఒడ్డిమెట్ట గ్రామంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రజలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. "రెండు ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం ఇంటింటి" కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించిన ఆమె ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. పర్యటన సందర్భంగా వినాయక, ఆంజనేయస్వామి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలతో సమావేశమై వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడి ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. గ్రామ మహిళలు, స్థానికులు చూపించిన ఆదరణ తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని అనిత తెలిపారు. గ్రామస్తులతో కలిసి కోలాటంలో పాల్గొని సందడి చేశారు. ప్రజల ప్రేమాభిమానాలు మరింత బాధ్యతను పెంచుతున్నాయని పేర్కొన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు. రూ.660 కోట్లకు పైగా సంక్షేమ కార్యక్రమాలు, రూ.500 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకొస్తున్నామని తెలిపారు.

ప్రాంత అభివృద్ధికి కీలకంగా మారనున్న ఉక్కు కర్మాగారం ద్వారా వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వివరించారు. ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత అభివృద్ధి, మరింత సంక్షేమం అందించేందుకు కృషి చేస్తానని హోంమంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ డిమాండ్

### దేవినేని అవినాష్ పాల్గొన్న రిలే దీక్ష

### విజయవాడ తూర్పులో వైఎస్సార్‌సీపీ నిరసన


విజయవాడ, ఆగస్టు 7 : డీఎస్సీ--2025 నియామకాలలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని పటమట క్లస్టర్ పరిధిలో ఆటోనగర్ బస్టాండ్ సమీపంలో నిర్వహించిన దీక్ష కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు డీఎస్సీ నియామకాలపై వస్తున్న ఆరోపణలను సమగ్రంగా విచారించాలని డిమాండ్ చేశారు. నియామక ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, అభ్యర్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు అవసరమని అభిప్రాయపడ్డారు. విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. నియామకాల వ్యవహారంలో తలెత్తిన వివాదాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, అభ్యర్థుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు. యువత భవిష్యత్తుతో ముడిపడిన అంశాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నిరుద్యోగ యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని నాయకులు కోరారు. నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కూడా నిరసనకారులు డిమాండ్ చేశారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ డిమాండ్లకు మద్దతు తెలుపుతూ నిరసన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారు.



# ఆసుపత్రి సేవలపై అచ్చెన్న దృష్టి

### తిలారు పీహెచ్‌సీ పరిశీలన.. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

శ్రీకాకుళం, ఆగస్టు 7 : కోటబొమ్మాళి మండలం తిలారు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి పేద రోగికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేగవంతమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని మంత్రి పేర్కొన్నారు. రోగుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించి చికిత్సలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని సూచించారు. మందుల లభ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన ఔషధాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వైద్య పరికరాల నిర్వహణ, పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల బలోపేతానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రజలు చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకే పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా నాణ్యమైన వైద్యం అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.



## త్వరలో వైద్య కళాశాల పనులు పూర్తి

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

విజయనగరం, ఆగస్ట్ 07:త్వరలో ప్రభుత్వ వైద్య కళాశాల పనులను పూర్తి చేస్తామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆయన కలెక్టరేట్ వద్ద శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడం వల్ల నాబార్డు ఫండ్స్ మురిగిపోయాయని చెప్పారు. ప్రస్తుతం సాస్కి ఫండ్స్‌తో కొత్తగా పనులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి గట్టిగా కృషి చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే చాలా వరకు పనులు పూర్తవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. మెడికల్ కాలేజ్ ఆసుపత్రి పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు, ప్రస్తుతం ఉన్న సర్వజన ఆసుపత్రిని కూడా ప్రభుత్వ ఆసుపత్రిగా కొనసాగించే దిశగా ప్రతిపాదనలను ముందుకు తీసుకువెళ్తున్నామని మంత్రి వివరించారు. మంత్రి తో బాటు ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు కూడా ఉన్నారు.





## ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి అపూర్వ స్పందన

**మంగళ హారతులతో మంత్రి కొండపల్లి గారికి స్వాగతం**

గజపతినగరం, ఆగస్టు 7: నియోజకవర్గంలో చేపడుతున్న ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి ప్రజల నుండి అపూర్వ స్పందన వస్తుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం బొండపల్లి మండలం గరుడ బిల్లి గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారికి తీన్మార్ వాయిద్యాలతో పువ్వులు జల్లుతూ స్వాగతం పలికారు. మహిళలు ఇంటి ముంగిటకు వెళ్ళగానే నుదుటన తిలకం దిద్ది, హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ కావడంతోనే ఇటువంటి అపూర్వమైన స్వాగతం లభిస్తుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు, ప్రతీ ఇంటికి కూటమి ప్రభుత్వంలో పథకాలు అందుతున్నాయన్నారు. రెండేళ్ల ప్రభుత్వ పాలన కరపత్రాలను అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి సారధ్యంలో రెండేళ్ల పాలనలో ప్రభుత్వం అనేక పథకాలను అమలుపరుస్తుందని తెలిపారు. అందులో ముఖ్యంగా పెన్షన్లు 3 వేల రూపాయల నుండి 4 వేల రూపాయలకు పెంచి రాష్ట్రవ్యాప్తంగా 62 లక్షల మందికి అందించడం జరుగుతుందన్నారు. అలాగే స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత సుఖీభవ, దీపం పథకం ద్వారా ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఒక్కరికి కాకుండా ఇంట్లో చదువుతున్న ప్రతి ఒక్కరికి తల్లికి వందనం అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిది అన్నారు. గరుడబిల్లి ప్రజలు అందించిన అపూర్వ స్వాగతం చాలా ఆనందాన్ని కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, బిజెపి నాయకులు రెడ్డి పావని, మండల పార్టీ అధ్యక్షులు రాపాక అచ్చం నాయుడు, మాజీ జెడ్పిటిసి బండారు బాలాజీ, బుజ్జి రాజు, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు పార్వతి తదితరులు పాల్గొన్నారు.





## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**స్వచ్ఛత కు మారుపేరు బ్రహ్మకుమారి స్ సంస్థ సేవలు**

**ప్రపంచంలోనే యువకులు కలిగిన దేశం భారత్**

**మోడీ, చంద్రబాబు గార్ల ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలు**

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు**

గజపతినగరం, ఆగస్టు 7: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు పిలుపునిచ్చారు. శుక్రవారం గజపతినగరం లోని బ్రహ్మకుమారిస్ ఆశ్రమ ప్రాంగణంలో నషాముక్త్ కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ నషాముక్త్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోడీ గారు ఆగస్టు 4వ తేదీన వర్చువల్ గా ప్రారంభించినట్లు తెలిపారు. బ్రహ్మకుమారీస్ మరియు కేంద్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలు వంటి వాటికి దూరంగా ఉండాలని నషాముక్త్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. 10 కోట్ల మందిని వ్యసనాల నుండి విముక్తి చేసేలా చేయటమే ధ్యేయంగా స్వచ్ఛతకు మారుపేరైన బ్రహ్మకుమారిస్ పనిచేస్తుందని, అందులో భాగంగా మన గజపతినగరంలో ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం చాలా అవసరమన్నారు. గురజాడ చెప్పినట్లు దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అన్న నినాదాన్ని పూర్తిగా తీసుకుని పెద్దలు చెప్పే మంచి మాటలను యువత తప్పక ఆచరించాలన్నారు. ప్రపంచంలోనే అధిక శాతం యువకులు కలిగిన దేశంగా మన భారతదేశం కలిగి ఉండటం గర్వకారణమని, యువత మంచి భవిష్యత్తును పొందాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ గారు, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు యువతను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తూ వినూత్న కార్యక్రమాలు చేపట్టటం జరుగుతుందన్నారు. ప్రభుత్వాలు యువత కోసం విద్యా వైద్యం మౌలిక వసతులు కల్పిస్తుందని ఆ అవకాశాలను యువత వినియోగించుకోవాలన్నారు. మన విజయనగరం జిల్లాను డ్రగ్స్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడానికి యువత కృషి చేయాలన్నారు. ఉన్నతమైన లక్ష్యాలతో యువత ముందుకు సాగాలని చెడు అలవాట్లకు బానిస అయిన వారిని సమాజంలో గౌరవప్రదంగా చూడరని, విద్య ద్వారా తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, విద్య ద్వారా జ్ఞానం పొందడంతో పాటు, కుటుంబానికి ఆసరాగా నిలవచ్చని, తద్వారా మంచి సమాజాన్ని కూడా నిర్మించుకోవచ్చన్నారు. ప్రభుత్వం బ్రహ్మకుమారి సంస్థ చేపడుతున్న ఈ చైతన్య యాత్రలో నేటి యువత కూడా భాగస్వాములు కావాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. సభా కార్యక్రమానికి ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థుల చేత నషాముక్త్ (వ్యసనాల నుండి విముక్తి) కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ గారు, స్టేట్ యూత్ కోఆర్డినేటర్ బికే అన్నపూర్ణ, గజపతినగరం ఇంచార్జ్ బికే స్వాతి తదితరులు పాల్గొన్నారు.



## దశాబ్దాల కల నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

**గరుడబిల్లి నుంచి నెలివాడ జంక్షన్ సిసి రోడ్డు ప్రారంభం.. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు**

గజపతినగరం, ఆగస్టు 7, నియోజకవర్గంలోని బొండపల్లి మండలం గరుడ బిల్లి ప్రజల దశాబ్దాల కలను కూటమి ప్రభుత్వం నెరవేర్చటం చాలా ఆనందంగా ఉందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం కోటి 20 లక్షల రూపాయలతో నిర్మించిన గరుడబిల్లి నుంచి నెలివాడ జంక్షన్ సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా రహదారి లేక వేరే దారి నుండి రాకపోకలు సాగించే గరుడబిల్లి ప్రజల సౌకర్యార్థం కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ చిత్తశుద్ధితో రోడ్డు పనులు చేపట్టడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి 50 లక్షల రూపాయలకు తక్కువ కాకుండా అభివృద్ధి చేపట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అలాగే గ్రామస్తుల కోరిక మేరకు స్మశాన వాటిక, అంగన్వాడి కేంద్రం పనులు చేపట్టడంతో పాటు, గ్రామంలో వి బి జి రాంజీ పథకంలో పుంత రోడ్లు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. 2014- 2019 సమయంలో సైతం నియోజకవర్గాన్ని నాటి శాసనసభ్యులు కొండపల్లి అప్పలనాయుడు గారు అభివృద్ధి పరచడం జరిగిందన్నారు.

ప్రస్తుత కారణంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి కూటమి కార్యకర్తపై ఉందని మంత్రి కొండపల్లి సూచించారు. రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమం సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ దశాబ్దాల కల నెరవేర్చిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారి సేవలను కొనియాడారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో తనదైన శైలిలో అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలుకుతూ ముందుకు సాగుతున్న నాయకుడు కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, బిజెపి నాయకులు రెడ్డి పావని, మండల పార్టీ అధ్యక్షులు రాపాక అచ్చం నాయుడు, మాజీ జెడ్పిటిసి బండారు బాలాజీ, బుజ్జి రాజు, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## తలుపులమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

**ఆషాఢ మాసంలో పుణ్యక్షేత్ర దర్శనం.. అమ్మవారికి చీర సమర్పించిన అనిత**

**ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు.. భక్తులతో ఆప్యాయంగా ముచ్చట**



తుని, ఆగస్టు 7: ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత ఆషాఢ మాసం సందర్భంగా కాకినాడ జిల్లా తుని సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవను సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీ తలుపులమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి చీర సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ దర్శనం అనంతరం రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సమృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు అనిత తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలు ఆనందంగా జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు.

తలుపులమ్మ లోవ ఆలయం ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖ శక్తిపీఠాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఆషాఢ మాసంలో ఇక్కడికి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో హోంమంత్రి దర్శనం



ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దర్శనానికి వచ్చిన భక్తులతో అనిత ఆప్యాయంగా ముచ్చటించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడడం ఆనందంగా అనిపించిందని ఆమె పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో పూజా కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఆలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు హోంమంత్రికి స్వాగతం పలికారు. భక్తుల రద్దీ మధ్య దర్శన కార్యక్రమం సజావుగా కొనసాగింది. అమ్మవారి కరుణాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నట్లు అనిత తెలిపారు. ప్రజల సుఖసంతోషాలు, రాష్ట్ర శ్రేయస్సు కోసం తన ప్రార్థనలు కొనసాగుతాయని పేర్కొన్నారు.



## ఎస్సీ అభివృద్ధి అధికారిగా లతకు అదనపు బాధ్యతలు

**సూర్యాపేట, ఆగస్టు 7 :**
సూర్యాపేట జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి (డీఎస్సీడీఓ), ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా కె. లత అదనపు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆమెకు ఈ రెండు విభాగాల బాధ్యతలను అదనంగా అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గతంలోనూ లత జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిగా పూర్తిస్థాయి బాధ్యతలు నిర్వహించారు. మరోసారి ఆమెకు బాధ్యతలు అప్పగించడంపై అధికారులు, సిబ్బంది, ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పలువురు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన షెడ్యూల్డ్ కులాల ప్రజలకు సమర్థవంతంగా చేరవేసేందుకు కృషి చేస్తారని పలువురు ఆకాంక్షించారు.

## స్వదేశీ స్ఫూర్తితో చేనేతకు అండగా నిలవాలి: రాంచందర్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 7 :**
'వోకల్ ఫర్ లోకల్--లోకల్ టు గ్లోబల్' స్ఫూర్తితో స్వదేశీ వస్త్రాలను ప్రోత్సహిస్తూ చేనేత రంగానికి ప్రజలు అండగా నిలవాలని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులు, కళాకారులు, వారి కుటుంబాలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. చేనేత దినోత్సవం స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేస్తుందని, దేశవ్యాప్తంగా లక్షలాది మంది నేత కార్మికుల అద్భుతమైన నైపుణ్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణకు గొప్ప చేనేత వారసత్వం ఉందని రాంచందర్‌రావు తెలిపారు. నారాయణపేట, కొత్తకోట, గద్వాల, పోచంపల్లి, సిరిసిల్ల ప్రాంతాల చేనేత వస్త్రాలు తమ ప్రత్యేకతతో అంతర్జాతీయ గుర్తింపు పొందాయని పేర్కొన్నారు. భారతీయ చేనేత ఉత్పత్తులను ప్రజలు ఆదరించి ప్రపంచ మార్కెట్‌కు చేరేలా ప్రోత్సహించాలని కోరారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి ధరించడం ద్వారా వేలాది నేత కుటుంబాల జీవనోపాధికి భరోసా కల్పించవచ్చన్నారు. 'వోకల్ ఫర్ లోకల్-లోకల్ టు గ్లోబల్' నినాదాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని, తద్వారా భారతీయ సంప్రదాయ కళలను పరిరక్షించడంతో పాటు చేనేత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చని రాంచందర్‌రావు పేర్కొన్నారు.

# ప్రామాణికంగా జిల్లా జనగణన హ్యాండ్‌బుక్

### డేటా నాణ్యత, ఖచ్చితత్వానికి ప్రాధాన్యం: జనగణన సంచాలకులు భారతి హోళీకేరి



**సూర్యాపేట, ఆగస్టు 7 :**
జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ (డీసీహెచ్‌బీ)ను అత్యంత ప్రామాణికంగా, నాణ్యతా ప్రమాణాలతో రూపొందించాలని జనగణన సంచాలకులు భారతి హోళీకేరి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇందులో పొందుపరిచే ప్రతి సమాచారం అధికారిక రికార్డుల ఆధారంగా ఖచ్చితంగా, సంపూర్ణంగా, ఏకరూపంగా ఉండాలని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆమె దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. సూర్యాపేట సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతి హోళీకేరి మాట్లాడుతూ తెలంగాణలో తొలిసారిగా ప్రతి జిల్లాకు ప్రత్యేక జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్లకు కూడా ప్రత్యేక హ్యాండ్‌బుక్‌లు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాల జనాభా, సామాజిక, ఆర్థిక, పరిపాలనా పరిస్థితులతో పాటు విద్య, వైద్యం, మౌలిక వసతులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని హ్యాండ్‌బుక్‌లో పొందుపరుస్తామన్నారు. భవిష్యత్ ప్రభుత్వ విధానాల రూపకల్పన, అభివృద్ధి ప్రణాళికలు, పరిశోధనలు, జనగణన విశ్లేషణలకు ఇది ప్రధాన ఆధార పత్రంగా ఉపయోగపడుతుందని చెప్పారు. రెవెన్యూ గ్రామం నుంచి పట్టణ స్థాయి వరకు అన్ని శాఖలకు సంబంధించిన వివరాలను సేకరించాలని సూచించారు. 2025 డిసెంబర్ 31 నాటికి అందుబాటులో ఉన్న సౌకర్యాలు, మౌలిక వసతులు, శాఖల సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. ఆగస్టు 10 నుంచి 21 వరకు సమాచార సేకరణ చేపట్టాలని, జిల్లా స్థాయిలో నోడల్ అధికారి ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి శాఖలవారీగా బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 8 వరకు సమాచార నమోదు, పరస్పర పరిశీలన పూర్తి చేయాలని సూచించారు. ప్రతి పట్టికను సంబంధిత శాఖాధికారి, జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ విభాగం రెండుసార్లు పరిశీలించాలని చెప్పారు. గణాంకాల్లో ఖాళీలు, పునరావృత నమోదులు, తప్పులు లేకుండా చూడడంతో పాటు మొత్తాలు, ఉపమొత్తాలను సరిచూసుకోవాలన్నారు. గత జనగణన గణాంకాలతో ప్రస్తుత సమాచారాన్ని పోల్చి అసాధారణ వ్యత్యాసాలు ఉంటే వాటికి కారణాలను నమోదు చేయాలని సూచించారు. గ్రామాల పేర్లను అధికారిక రెవెన్యూ రికార్డుల ప్రకారమే నమోదు చేయాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 8లోగా జిల్లా సమగ్ర పరిచయాన్ని సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లా భౌగోళిక స్థితి, పరిపాలనా నిర్మాణం, ఆర్థిక కార్యకలాపాలు, సామాజిక పరిస్థితులు, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, అభివృద్ధి సూచికలు, జిల్లా ప్రత్యేకతలను ఇందులో పొందుపరచాలన్నారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8వరకు సమాచారాన్ని సమగ్రంగా ధృవీకరించాలని ఆదేశించారు. ప్రతి సమాచారం ప్రామాణికత, ఖచ్చితత్వం, తాజాదనం, సంపూర్ణత, ఏకరూపత అనే ఐదు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. అన్ని అభ్యంతరాలను పరిష్కరించి, బాధ్యతాధికారి ధృవీకరణ అనంతరమే జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ పార్ట్--ఎను రాష్ట్ర జనగణన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ జనగణన సంచాలకులు ఇచ్చిన సూచనలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తామని తెలిపారు. సంబంధిత శాఖల నుంచి నిర్ణీత నమూనాలో సమాచారం సేకరించి, పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం నిర్ణీత గడువులో రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తామని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.హరి సింగ్, సీపీఓ కిషన్‌తో పాటు సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాస్త్రంలో విశేష కృషి.. నాసీ సభ్యురాలిగా డాక్టర్ బి. నిర్మల

**హైదరాబాద్, ఆగస్టు 7 :**
వ్యవసాయ, వృక్ష శాస్త్ర రంగాల్లో విశేష పరిశోధనలు చేసి సేవలందించిన ఐసీఏఆర్--నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (NAARM) ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ బి. నిర్మల ప్రతిష్ఠాత్మక నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియా (NASI) సభ్యురాలిగా ఎంపికయ్యారు. 2007 అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీస్ (ఏఆర్ఎస్) బ్యాచ్‌కు చెందిన డాక్టర్ నిర్మల గతంలో హైదరాబాద్‌లోని ఐసీఏఆర్--ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్‌లో సేవలందించారు. దేశంలోని ప్రధాన వరి సాగు ప్రాంతాల్లో విస్తృతంగా క్షేత్రస్థాయి పరిశోధనలు నిర్వహించడంతో పాటు 15 పరిశోధనా ప్రాజెక్టులకు నాయకత్వం వహించారు. డాక్టర్ నిర్మల ఇప్పటివరకు పీర్ రివ్యూడ్ జర్నల్స్‌లో 88 పరిశోధనా పత్రాలు, 23 సాంకేతిక వ్యాసాలు ప్రచురించారు. 14 పుస్తకాలు, 33 పుస్తక అధ్యాయాలు, ఏడు సాంకేతిక బులెటిన్లు, 22 శిక్షణ మాన్యువల్లను రూపొందించారు. సాంకేతిక పరిజ్ఞాన విస్తరణ కార్యక్రమాలకు ప్రధాన పరిశోధకురాలిగా వ్యవహరిస్తూ దేశవ్యాప్తంగా 12,468 ఫ్రంట్‌లైన్ ప్రదర్శనలను సమన్వయం చేశారు. వీటి ద్వారా రైతులు మెరుగైన వ్యవసాయ సాంకేతికతను అందిపుచ్చుకోవడంతో



పాటు సాగు వ్యయాలను తగ్గించుకునేందుకు తోడ్పడ్డారు. అలాగే 65 శిక్షణ కార్యక్రమాలను నిర్వహించిన ఆమె 14 మంది పీజీ, ముగ్గురు పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు. ఉత్తమ పరిశోధనా పత్రానికి డాక్టర్ ఆర్.టి. దోషి అవార్డు, సొసైటీ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ నుంచి యంగ్ సైంటిస్ట్ అవార్డు సహా పలు పురస్కారాలను అందుకున్నారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ నుంచి ఫెలో/అసోసియేట్ ఫెలో గుర్తింపు పొందడంతో పాటు మొబిలైజేషన్ సొసైటీ ఫెలోగా కూడా ఉన్నారు. 1930లో స్థాపితమైన నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియా దేశంలోని అత్యంత పురాతన సైన్స్ అకాడమీ. శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడం, శాస్త్ర విజ్ఞానాన్ని విస్తృతంగా వ్యాప్తి చేయడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యాలు.

## వట్టె జానయ్యపై కక్షసాధింపు చర్యలు సరికావు

### తెలంగాణ విఠల్

**హైదరాబాద్, ఆగస్టు 7 :**
రాష్ట్రంలోని రైస్ మిల్లులు, ఇతర రంగాల్లో జరిగే అక్రమాలపై ప్రభుత్వం చట్టాన్ని అందరికీ సమానంగా అమలు చేయాలని సామాజిక వేత్త తెలంగాణ విఠల్ డిమాండ్ చేశారు. బీసీ నాయకుడు వట్టె జానయ్య యాదవ్‌ను లక్ష్యంగా చేసుకుని కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారనే



ఆరోపణలు వినిపిస్తున్నాయని, అక్రమాలకు పాల్పడిన వారెవరైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, అయితే కేవలం బీసీ నాయకులనే లక్ష్యంగా చేసుకోవడం సమంజసం కాదని పేర్కొన్నారు.
రాష్ట్రంలో సుమారు 3,000 రైస్ మిల్లులు ఉండగా వాటిలో దాదాపు 95 శాతం అగ్రవర్ణాలు, పెత్తందారుల ఆధీనంలోనే ఉన్నాయని తెలంగాణ విఠల్ తెలిపారు. సివిల్ సప్లైస్ శాఖలో సుమారు రూ.14 వేల కోట్ల విలువైన ధాన్యం అక్రమాలు జరిగాయని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా అంగీకరించారని పేర్కొంటూ, అలాంటి పరిస్థితుల్లో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ యంత్రాంగం ఎందుకు సమర్థంగా చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.
శాఖలో వేల కోట్ల రూపాయల అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వం అంగీకరించిన నేపథ్యంలో, నైతిక బాధ్యత వహిస్తూ పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని తెలంగాణ విఠల్ డిమాండ్ చేశారు.
రాష్ట్ర జనాభాలో గణనీయమైన వాటా ఉన్న బీసీలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో తగిన ప్రాతినిధ్యం, అవకాశాలు దక్కడం లేదని ఆయన విమర్శించారు. సామాజిక అసమానతలను తొలగించి సమాన హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.




## చదువుకున్న పాఠశాలకు రూ.లక్ష విరాళం

**చిలుకూరు, ఆగస్టు 7 :**
తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధితో పాటు పేద విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో విశ్రాంత ఉపాధ్యాయురాలు పొందూరి విజయలక్ష్మి రూ.లక్ష విరాళం ప్రకటించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు పొందూరి రామయ్య జ్యేష్ఠ పుత్రిక అయిన విజయలక్ష్మి సోషల్ స్టడీస్ ఉపాధ్యాయురాలిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం తాను చదువుకున్న చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.లక్ష అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ మొత్తంపై వచ్చే వడ్డీతో ప్రతి సంవత్సరం 6 నుంచి 10వ తరగతి వరకు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించాలని సూచించారు. తాను చదువుకున్న పాఠశాలను మరిచిపోకుండా పేద వర్గాల విద్యార్థుల ప్రయోజనం కోసం విజయలక్ష్మి విరాళం ప్రకటించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు సైతం తమ వంతుగా పాఠశాల అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమె సోదరుడు పొందూరి సత్తిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజారావు, కోదండరామయ్య, కైలాసం వెంకటేశ్వర్లు, కస్తూరి అప్పారావు, హమీదా, శామ్ సెన్సార్, సత్యనారాయణ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## సుస్థిర భవిష్యత్తుకు వినూత్న ఆవిష్కరణలు అవసరం

### ఎంజీఐటీలో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

**హైదరాబాద్, ఆగస్టు 7 :**
సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని వినూత్న ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రముఖ శాస్త్రవేత్తలు పిలుపునిచ్చారు. హైదరాబాద్ గండిపేటలోని మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ)లో శుక్రవారం 'సుస్థిర భవిష్యత్తు కోసం విఘాతాత్మక ఆవిష్కరణలు' (ICDISF-2026) అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సదస్సుకు పద్మశ్రీ డాక్టర్ కె. బాలసుబ్రమణియన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఆర్‌డీఎల్-డీఆర్‌డీఓ డైరెక్టర్, విశిష్ట శాస్త్రవేత్త డాక్టర్ ఎ. రాజు గౌరవ అతిథిగా పాల్గొన్నారు. కెనడాలోని టొరంటో విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రవి రవీంద్రన్ అధ్యక్షోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలసుబ్రమణియన్ మాట్లాడుతూ పరిశోధకులు ప్రస్తుత సాంకేతిక అవసరాలకే పరిమితం కాకుండా రాబోయే రెండు దశాబ్దాల్లో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసేలా పరిశోధనలు చేపట్టాలని సూచించారు. విజ్ఞానశాస్త్రం జ్ఞానాన్ని సృష్టిస్తే, సాంకేతికత ఆ జ్ఞానాన్ని సమన్వయం చేస్తుందని పేర్కొన్నారు. దీర్ఘకాలిక దృక్పథం, పరస్పర సహకారం, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవడం అత్యంత ముఖ్యమన్నారు. ప్రొఫెసర్ రవి రవీంద్రన్ మాట్లాడుతూ పరిశోధనల్లో సుస్థిరతకు కేంద్రస్థానం కల్పించాలని, పర్యావరణ ప్రభావం, రీసైక్లింగ్, సహజ వనరుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డాక్టర్ ఎ. రాజు మాట్లాడుతూ దేశ సాంకేతిక సామర్థ్యాన్ని బలోపేతం చేయడంతో పాటు 'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధనకు నిరంతర ఆవిష్కరణలు కీలకమని పేర్కొన్నారు. ఎంజీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ తమ విద్యాసంస్థ పరిశోధన, ఆవిష్కరణలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థులు తమ ఆసక్తులకు అనుగుణంగా పరిశోధనలు కొనసాగిస్తూ సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సూచించారు. మలేషియాకు చెందిన ప్రొఫెసర్ యు. జాన్సన్ అలెంగారం ప్రొఫెషనల్ ఇంజినీరింగ్, అత్యున్నత ప్రభావం కలిగిన పరిశోధన ప్రచురణలు, అధునాతన సాంకేతికత, సుస్థిరత, విపత్తులను తట్టుకునే సామర్థ్యం, సామాజిక సమ్మిళితత్వం తదితర అంశాలపై ప్రత్యేక ప్రసంగాలు చేశారు. రెండు రోజుల సదస్సులో వర్ధమాన సాంకేతిక పరిజ్ఞానం, సుస్థిర పరిష్కారాలపై కీలకోపన్యాసాలు, ప్రత్యేక ప్రసంగాలు, సాంకేతిక సమావేశాలు నిర్వహిస్తున్నారు. పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రమల నిపుణులు, విద్యార్థులు పాల్గొంటున్న ఈ అంతర్జాతీయ సదస్సు శనివారం ముగియనుంది.

## బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

**హైదరాబాద్, ఆగస్టు 7 :**
పన్నెండేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి హైదరాబాద్‌లోని పోక్సో ప్రత్యేక సెషన్స్ కోర్టు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. రూ.10 వేల జరిమానా కూడా విధిస్తూ తీర్పు వెల్లడించింది. 2019లో నమోదైన ఈ కేసులో మహ్మద్ మొహసిన్ (45)ను న్యాయస్థానం దోషిగా నిర్ధారించింది. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం కుటుంబ నివాసంలో స్థలం సరిపోకపోవడంతో బాధిత బాలిక కొంతకాలం నిందితుడి ఇంట్లో ఉంటోంది. ఈ సమయంలో నిందితుడు బాలికపై లైంగిక దాడికి పాల్పడడంతో పాటు విషయం బయటకు చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించినట్లు అభియోగాలు నమోదయ్యాయి. బాలిక అనంతరం జరిగిన విషయాన్ని తన తల్లికి తెలియజేయడంతో బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. కేసు విచారణ కొనసాగిన సమయంలో బాధిత బాలికకు, ఆమె కుటుంబ సభ్యులకు భరోసా కేంద్రం ద్వారా కౌన్సెలింగ్‌తో పాటు అవసరమైన మానసిక, న్యాయపరమైన సహాయాన్ని అందించారు. నిందితుడికి శిక్ష ఖరారు కావడంపై బాధిత కుటుంబం ఉపశమనం వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు, విచారణలో ఏసీపీ శ్రీనివాసరావు, ఆర్. కళింగరావు, ఎ. రమాదేవి, ప్రత్యేక అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. ప్రతాప్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి. కల్పన, న్యాయ సలహాదారు ఏఆర్ హిమా మీనన్ కీలకంగా వ్యవహరించారు.



## రజనీకాంత్ సరసన శ్రీలీల?..

# కోలీవుడ్‌లో జోరుగా ప్రచారం

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రీలీలకు కోలీవుడ్‌లో భారీ అవకాశం దక్కబోతున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. 'పెళ్లి సందఢ'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన శ్రీలీల, 'ధమాకా' విజయంతో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. అయితే ఆ తర్వాత వరుసగా వచ్చిన కొన్ని చిత్రాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో తెలుగులో అవకాశాలు కొంత తగ్గాయి. దీంతో ఇప్పుడు ఆమె ఇతర భాషల చిత్రాలపై దృష్టి సారించింది. ఇప్పటికే బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్ సరసన ఓ భారీ చిత్రంలో నటిస్తున్న శ్రీలీలకు తాజాగా కోలీవుడ్ నుంచి మరో ప్రతిష్టాత్మక ఆఫర్ వచ్చినట్లు సమాచారం. తమిళ సినీ వర్గాల కథనాల ప్రకారం, సూపర్ స్టార్ రజనీకాంత్ నటించనున్న ఓ పాన్ ఇండియా చిత్రంలో శ్రీలీలను కథానాయికగా తీసుకునే దిశగా చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం రజనీకాంత్ వరుస భారీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉండగా, ఆయన లైనప్‌లోని ఒక చిత్రంలో శ్రీలీలకు అవకాశం లభించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ ఖరారైతే శ్రీలీల కెరీర్‌లో ఇది అత్యంత కీలక మలుపుగా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత రజనీకాంత్ వంటి లెజెండరీ స్టార్‌తో కలిసి నటించే అవకాశం రావడం ఆమె కెరీర్‌కు కొత్త ఊపునిస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ సినిమా విజయం సాధిస్తే దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ శ్రీలీల క్రేజ్ మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.ం

# ఏఏ23లో ప్రతినాయకుడిగా షాహిద్ కపూర్?..

### సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రాకా' చిత్ర షూటింగ్‌లో పాల్గొంటున్న బన్నీ, ఆ తర్వాత దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరకెక్కించనున్న ఏఏ23 చిత్రంలో నటించనున్నారు. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న వేళ, తాజాగా మరో ఆసక్తికర వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తాజా ప్రచారం ప్రకారం, ఏఏ23లో కీలక ప్రతినాయకుడి పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్ పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. కథలో హీరోతో సమానంగా తలపడే శక్తివంతమైన పాత్రగా దీనిని రూపొందిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే, ఈ వార్తలపై చిత్రబృందం నుంచి ఇప్ప టి వరకు ఎలాంటి అధి కారిక ప్రక టన వెలువడ లేదు. దర్శకుడు లోకే ష్ కనగ రాజ్ తన సినిమాల్లో ప్రతి నా యకుల పాత్రలకు ప్రత్యేక ప్రాధాన్యం




ఇస్తారనే విషయం తెలి సిందే. గతంలో ఆయన తెరకెక్కిం చిన చిత్రాల్లో ప్రతినాయక పాత్ర లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకు న్నాయి.

## బేబమ్మకు మళ్లీ మంచి రోజులు వస్తాయా?..

### జినీ'పైనే కృతి శెట్టి ఆశలు

'ఉప్పెన' సినిమాతో బేబమ్మగా తెలుగు ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న కృతి శెట్టి తొలి చిత్రంతోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ఆ సినిమా ఘనవిజయం సాధించడంతో టాలీవుడ్‌లో వరుస అవకాశాలు ఆమెను వెతుక్కుంటూ వచ్చాయి. అగ్ర హీరోల సరసన నటించే అవకాశాలు కూడా దక్కాయి. అయితే ఎంత వేగంగా విజయాలను అందుకుందో, అంతే వేగంగా ఆమె కెరీర్ ఒడిదుడుకులను ఎదుర్కొంది. వరుసగా నటించిన చిత్రాలు ఆశించిన విజయాలను అందుకో కపోవడంతో తెలుగులో కృతి శెట్టికి అవకాశాలు తగ్గాయి. దీంతో తన కెరీర్‌కు కొత్త ఊపు తీసుకురావాలనే లక్ష్యంతో ఆమె తమిళ సినీ పరిశ్రమపై దృష్టి సారించింది. విభిన్న కథలు, నటనకు అవకాశం ఉన్న పాత్రల ద్వారా మరోసారి తన ప్రతిభను నిరూపించుకోవాలని ప్రయత్నిస్తోంది. అయితే కోలీవుడ్‌లో కూడా ఆమె ప్రయాణం ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో సాగలేదు. ఇటీవల యువ హీరో ప్రదీప్ రంగనాథ్‌తో కలిసి నటించిన 'ఎల్.ఐ.కె' చిత్రంపై కృతి శెట్టి భారీ ఆశలు పెట్టుకుంది. ఈ జంటపై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొన్నప్పటికీ, సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. దీంతో ఆమెకు మరోసారి నిరాశే ఎదురైంది. ప్రస్తుతం కృతి శెట్టి తన ఆశలన్నీ 'జినీ' సినిమాపైనే పెట్టుకుంది. ఈ చిత్రం తన కెరీర్‌కు కీలక మలుపు అవుతుందనే నమ్మకంతో ఉంది. బలమైన కథ, నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకోగలిగితే మరోసారి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఒకప్పుడు టాలీవుడ్‌లో వరుస ఆఫర్లతో బిజీగా ఉన్న కృతి శెట్టి మళ్లీ అదే స్థాయిలో రాణించాలని ఆమె అభిమానులు కోరుకుంటున్నారు. సరైన కథలు, బలమైన పాత్రలను ఎంపిక చేసుకుంటే మరోసారి తెలుగు సినీ పరిశ్రమలో తన స్థానాన్ని తిరిగి సంపాదించడం అసాధ్యం కాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ అంచనాలన్నింటికీ సమాధానం 'జినీ' సినిమా ఫలితమే ఇవ్వనుంది. ఈ చిత్రం కృతి శెట్టి కెరీర్‌కు కొత్త ఊపునిస్తుందా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.



## 'కొరియన్ కనకరాజు'కు బాక్సాఫీస్‌లో అదిరిపోయే ఓపెనింగ్..




### బుక్‌మైషోలో 33 వేల టికెట్లు విక్రయం

ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా నటించిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనక రాజు' విడుదలకు ముందే భారీ అంచ నాలు సొంతం చేసుకుంది. వినూత్నమైన కథ, ఆకట్టుకునే ట్రైలర్, జోరుగా సాగిన ప్రమోషన్లతో ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించిన ఈ చిత్రం విడుదలైన తొలి రోజే బాక్సాఫీస్ వద్ద బలమైన ఆరంభాన్ని నమో దు చేసినట్లు తెలుస్తోంది. సినిమా విడుదల కు ముందే అడ్వాన్స్ బుకింగ్స్‌కు విశేష స్పందన లభించింది. ముఖ్యంగా చివరి 24 గంటల్లో బుకింగ్స్ భారీగా పెరిగాయి. ప్రముఖ టికెటింగ్ వేదిక బుక్‌మైషోలో ఒక్కటే 33 వేలకుపైగా టికెట్లు అమ్ముడ వ్వడం సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తిని స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ స్పందనతో చిత్రబృందం, అభిమానులు ఆనందం వ్య క్తం చేస్తున్నారు. విడుదలకు ముందు హైద రాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో నిర్వహిం చిన ప్రత్యేక ప్రీమియర్ షోలకు కూడా మంచి స్పందన లభిం చింది. చాలా థియేట ర్లలో ప్రీమియర్ షోలు హౌస్‌ఫుల్‌గా ప్రదర్శిం చబడ్డాయి. సిని మా చూసిన ప్రేక్షకుల నుంచి తొలి స్పందన సానుకూ లంగా రావడంతో సోషల్ మీడియాలో ఈ చిత్రం పై చర్చ జోరందు కుంది. ము ఖ్యంగా వరుణ్ తేజ్ కామెడీ టైమింగ్, నటన, హారర్‌తో మిళితమైన వినోదాత్మక సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



## టాలీవుడ్‌పై మళ్లీ దృష్టి పెట్టిన

# పూజా హెగ్డే

### బలమైన కమ్‌బ్యాక్‌కు సిద్ధం!

టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న బుట్టబొమ్మ పూజా హెగ్డే మరోసారి తెలుగు చిత్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత కొంతకాలంగా బాలీవుడ్, కోలీవుడ్ చిత్రాలతో బిజీగా ఉన్న ఆమె, ఇప్పుడు టాలీవుడ్‌లో బలమైన కమ్‌బ్యాక్ ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. 'అల వైకుంఠపురములో', 'అరవింద సమేత', 'మహర్షి' వంటి వరుస విజయాలతో అగ్ర కథానాయికగా ఎదిగిన పూజా హెగ్డే కెరీర్‌కు 'రాధే శ్యామ్' తర్వాత కొంత బ్రేక్ పడింది. ఆ చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోకపోవడంతో తెలుగులో ఆమెకు అవకాశాలు తగ్గినట్లు కనిపించింది. మహేష్ బాబు హీరోగా తెరకెక్కిన 'గుంటూరు కారం' చిత్రంలో తొలుత పూజా హెగ్డేనే కథానాయికగా ఎంపిక చేసినప్పటికీ, అనివార్య కారణాల వల్ల ఆమె ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు. అనంతరం ఆమె స్థానంలో శ్రీలీలను ఎంపిక చేయడం అప్పట్లో సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం పూజా హెగ్డే దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న 'శ్రీశ్రీ' చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాపై ఆమె భారీ ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో తెలుగు దర్శకులు, నిర్మాతలు వినిపిస్తున్న కథలను కూడా ఆమె పరిశీలిస్తున్నారని, బలమైన కథ, నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్ర దొరికితే వెంటనే అంగీకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.టాలీవుడ్‌లో మరోసారి అగ్ర కథానాయికగా తన స్థానాన్ని తిరిగి సంపాదించుకోవాలనే లక్ష్యంతో పూజా హెగ్డే అడుగులు వేస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ తన కెరీర్‌ను కొత్త దిశగా తీసుకెళ్లాలని ఆమె భావిస్తున్నట్లు సమాచారం. అయితే, కొత్త తెలుగు ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467